క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అచ్చంపేట: నియోజకవర్గంలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఆంజనేయులు తెలిపారు. అచ్చంపేట 132/33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా అచ్చంపేట, ఉప్పునుంతల, లింగాల, బల్మూర్, అమ్రాబాద్, పదర మండలాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో కూలీల హాజరు పెంచాలి



చారకొండ: ఉపాధిహామీ పథకంలో ప్రతి గ్రామంలో రోజూ 300కు పైగా కూలీలు పనిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జయసుధ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి అధికారులతో, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉపాధి కూలీల హాజరు, పనుల వివరాలపై సమీక్షించారు. ఎంపీఓ వెంకటేష్, ఉపాధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారిగా జీఆర్ శ్రీధర్‌జీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన బీసీ సంక్షేమ శాఖ వసతిగృహ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో కొనసాగుతున్న వసతిగృహాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ఉన్నతాధికారుల సహాయ సహకారాలతో కృషి చేస్తానన్నారు. వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా పర్యవేక్షణ కొనసాగిస్తామన్నారు. కలెక్టర్ తనకు అప్పగించిన బీసీ సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి జిల్లా అభివృద్ధికి పాటుపడుతానన్నారు. శ్రీరాములు, తరంగిణి, నర్సింహారెడ్డి, యాదయ్య, సురేష్, లక్ష్మీ పాల్గొన్నారు.

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్

కల్వకుర్తి రూరల్: మాలమహానాడు జిల్లా నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. అధ్యక్షుడిగా చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడిగా రవి, జిల్లా కన్వీనర్‌గా మల్లేష్‌ను నియమించారు.

ఫీడర్ చానల్ పనులు వేగవంతం చేయాలి

కల్వకుర్తి రూరల్: ఫీడర్ చానల్ పనులు వేగవంతం చేసి రైతులకు ఉపయోగపడేలా చూడాలని ఎంపీడీఓ ఆంజనేయులు కోరారు. బుధవారం మండలంలోని ఎల్లికట్టలో ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. అనంతరం మండలంలోని జీడిపల్లిలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. రమాదేవి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ జిల్లా కన్వీనర్‌గా నరేష్‌చారి

తాడూరు: విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కన్వీనర్‌గా మండలంలోని అంతారానికి చెందిన నరేష్‌చారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న రోజుల్లో విశ్వబ్రాహ్మణ సమాజాన్ని జాగృతం చేసి సమాజం కోసం మంచి పనులు చేసేవారికి అండగా ఉండాలన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్ గ్రామ పారిశుద్ధ్య కార్మికులు బుధవారం సీఎం చిత్రపటానికి గ్రామపంచాయతీ ఆవరణలో పాలాభిషేకం చేశారు. కార్మికుల శ్రమను సీఎం గుర్తించడం సంతోషంగా ఉందన్నారు. వెంకటేష్, మహేష్, మల్లేష్ పాల్గొన్నారు.

రైతులపై నిర్లక్ష్యం వీడాలి

తాడూరు: ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యం వీడి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి సకాలంలో డబ్బులు అందించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఐతోల్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అధికారులు స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఆంజనేయులు, చంద్రయ్య, ఎల్లమ్మ, వీరయ్య పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లి తండాలో బుధవారం ఎంపీటీసీ బూరం మల్లేష్ సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో తండాలోని వీధులను సీసీరోడ్లుగా అభివృద్ధి చేయనున్నామని తెలియజేశారు. యాదిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ధాన్యం ఆరబెట్టేందుకు అవస్థలు



పెద్దకొత్తపల్లిలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



పెద్దకార్పాములలో మొలకెత్తిన వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న భరత్‌కుమార్

పెద్దకొత్తపల్లి: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు దేవల్‌తిరుమలాపూర్ గ్రామాల్లో పెద్దకొత్తపల్లి సింగిల్‌విండో ద్వారా రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 500ల మంది రైతులతో 16 లారీల వరిధాన్యాన్ని కొనుగోలు చేసిన లారీలకు ఎత్తకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యాన్ని తడవకుండా కాపాడేందుకు అవస్థలు పడుతున్నారు. సంచుల్లోని ధాన్యం కూడా తడిసిపోవడంతో ఆరబెట్టేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొనుగోలు చేయాలి..

అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బీజేవైఎం మండల కార్యదర్శి భరత్‌కుమార్ అన్నారు. బుధవారం పెద్ద కార్పాములలో కల్లాల వద్ద తడిసిన వరిధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన వరి ధాన్యానికి గిట్టుబాట ధర కల్పించి కొనుగోలు చేయాలని కోరారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం..



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గుర్వయ్య గౌడ్

చారకొండ: రైతులు పండించిన ప్రతి వరి గింజను కొనుగోలు చేసి, రైతులకు మద్దతు ధర చెల్లిస్తామని చారకొండ సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతు వేదిక వద్ద వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సింగిల్‌విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని రైతులు కష్టపడి పండించిన పంటను దళారీలకు అవకాశం లేకుండా పీఏసీఎస్, ఐకేపీల ద్వారా ఇతర సంస్థల ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తామన్నారు. వెంకటయ్య, రమేష్, కొండల్, నిర్మల్ రావు, యాతం శ్రీను, నరేందర్ రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు పరిశీలన..

కోడేరు: మండల కేంద్రంతో పాటు ముత్తిరెడ్డిపల్లి, జనుంపల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేద్రాలను సింగిల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి ధాన్యం తడిసిన కూడా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అన్నారు. రైతులు అధైర్యపడవద్దని చెప్పారు. 'ఏ' గ్రేడ్‌కు రూ.2,060, 'బి' గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2,040లు చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ నర్సింహారెడ్డి, సీఈఓ ప్రకాష్‌రెడ్డి, ఖాజా, ఖాన్ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో అన్ని వసతులు కల్పించాలి



అమ్రాబాద్ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి

అమ్రాబాద్: బస్టాండ్‌లో అన్ని వసతులు కల్పించాలని ఆర్టీసీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఆర్‌ఎం శ్రీదేవి సూచించారు. ఉచిత టాయిలెట్స్ నిర్మాణం కోసం బుధవారం అమ్రాబాద్‌కు వచ్చిన ఆమె బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండ్‌లో ఉచిత టాయిలెట్స్ నిర్మాణం చేయడంతో పాటు బస్సులు రోడ్డు మీద కాకుండా బస్టాండ్‌లోనే నిలిచేలా చూడాలని అచ్చంపేట డిపో మేనేజర్ రాజశేఖర్, సీఆర్‌పీఏ చంద్రయ్యకు సూచించారు.

తెలంగాణ భరోసా సభను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న బ్రహ్మయ్య

కొల్లాపూర్ రూరల్: తెలంగాణ భరోసా సభను జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కారంగి బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రామాపురం, మొలచింతలపల్లి, ఎల్లూరు, నార్లాపూర్ గ్రామాల్లో తెలంగాణ భరోసా సభ పోస్టర్లను బీఎస్పీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా రామాపురంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో తెలంగాణ భరోసా బహిరంగ సభ కొనసాగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బహుజనులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో బీఎస్పీ మండల ఉపాధ్యక్షుడు బంకల దాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జనచైతన్య యాత్ర



పద్మన్నపల్లిలో కళాజాతా ప్రదన్శనలు

లింగాల: మండలంలోని పలు గ్రామాల్లో ఎర్రం దంపతులు చేపట్టిన జన చైతన్య యాత్ర బుధవారం ఐదో రోజు కొనసాగింది. బుధవారం మండలంలోని అవుసలికుంట, చెన్నంపల్లి, కొత్తచెర్వుతండా, పద్మన్నపల్లి, ఎర్రపెంట గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా పోటీ చేయనున్న స్వతంత్ర అభ్యర్థి ఎర్రం యామిని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తున్నాయని విమర్శించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన జన చైతన్య యాత్ర సందర్భంగా నిర్వహిస్తున్న కళాజాతా ప్రదర్శనలు పలువురిని ఆకర్శిస్తున్నాయి.

క్రీడా ప్రాంగణాలను సరిచేయాలని వినతి

తెలకపల్లి: క్రీడా ప్రాంగణాలను బాగు చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కారంగి బ్రహ్మయ్య అన్నారు. బుధవారం ఎంపీడీఓ భాస్కర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో వివిధ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారని, వాటి పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జ్ బీరం మోహన్‌రెడ్డి, శివశంకర్, సాయిబాబు, రాజేష్, శివ, దాసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం



నూతన విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



ఉత్సవ విగ్రహాలతో గ్రామస్తులు

తాడూరు: మండలంలోని అంతారంలో శివఆంజనేయ నవగ్రహ బొడ్రాయి మొదటి వార్షికోత్సవాన్ని సర్పంచ్ జయమ్మ, మాజీ సర్పంచ్ చినరాములు, ఉపసర్పంచ్ శాంతయ్య ఆధ్వర్యంలో వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజు ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం బొడ్రాయి దేవతా అభిషేకం, నవగ్రహ రుద్రయోగిని దేవత దేవాలయ యాగశాల, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సీతారామ ఉత్సవ వాగ్రహ జలాభిషేకం, ధాన్యాదివాసం వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో కనుల పండువగా నిర్వహించే వార్షికోత్సవంలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులంతా పాల్గొని విజయవంతం చేశారని సర్పంచ్ తెలియజేశారు.

ప్లాట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

నాగర్‌కర్నూల్ రూరల్: ఇళ్ల స్థలాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విషయంలో ఈ నెల చివరి వరకు ప్రభుత్వం అవకాశం ఇవ్వడం సంతోషదాయకమేనని, గతంలో ఇళ్ల స్థలాల పట్టా సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులకు ఇంటి బిల్లు, కరెంటు బిల్లులతో సంబంధం లేకుండా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రాములు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇస్తూ.. ఇళ్ల స్థలాలు ఉన్న ప్రతి వ్యక్తికి ఇల్లు నిర్మించుకోవడం కోసం రూ.3 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. ఈ హామీని నెరవేర్చడంలో ఇంటి పట్టా సర్టిఫికెట్ ఉన్నవారందరికీ ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ నమోదు చేసుకోవడం కోసం ఇంటి బిల్లు, కరెంటు బిల్లు జతచేయాలనే నిబంధనను సవరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ, అధ్యక్షుడు చింత ఆంజనేయులు, బాలస్వామి, కాశన్న, కృష్ణయ్య, వెంకటయ్య, బక్కన్న, సురేందర్ పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండగా సీఎం కేసీఆర్

చారకొండ: రాష్ట్రంలో నిరుపేదలకు, పేదింటి ఆడబిడ్డల పెళ్లిలకు సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి వారికి అండగా నిలుస్తున్నారని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మర్రిపల్లి సర్పంచ్ నరేష్ నాయక్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మర్రిపల్లికి చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తహసీల్దార్ శ్రీనివాస్ రావు, సర్పంచ్ నరేష్ నాయక్ చెక్కులు అందజేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

అచ్చంపేట: సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం పార్లమెంటు సభ్యులు పోతుగంటి రాములు బాధితులకు అందజేశారు. నియోజవర్గంలోని నలుగురు లబ్ధిదారులకు ఎంపీ క్యాంపు కార్యాలయంలో అందుకున్నారు. వంగూరుకు చెందిన శంకర్‌కు రూ.లక్ష, నాగర్‌కర్నూల్‌కు చెందిన నిరంజన్‌కు రూ.60 వేలు, పులిజాలకు చెందిన ఎర్రమ్మకు రూ.60 వేలు, పొల్కంపల్లికి చెందిన శ్రీకాంత్‌కు రూ.56 వేల చెక్కులను అందజేశారు.

నిరుపేదలకు కల్యాణలక్ష్మి

పెంట్లవెల్లి: మండల పరిధిలోని మల్లేశ్వరానికి చెందిన బంకలి ఈశ్వరమ్మకు తహసీల్దార్ కార్యాలయంలో సర్పంచ్ తిరుపాటి నాగరాజు చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కు అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్దండ: మండలంలోని కొట్రకి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త, వార్డు సభ్యులు విష్ణువర్ధన్‌రావు(40) హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినాడు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి వేర్వేరుగా కొట్రకి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

ప్రభుత్వ విప్ పరామర్శ

బల్మూర్: మండలంలోని గోదల్‌లో ఉపాధి పనికి వెళ్లి గుండెపోటుకు గురై మృతి చెందిన వెంకటయ్య కుటుంబాన్ని బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరామర్శించారు.

ఎమ్మెల్సీకి వినతి

వెల్దండ: మండల పరిధిలోని కేస్లీతండాలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని కోరుతూ సర్పంచ్ బుజ్జి లక్ష్మణ్‌నాయక్ బుధవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వినతి అందజేశారు.

విజేతలకు బహుమతి ప్రదానం

కల్వకుర్తి రూరల్: మేడే వారోత్సవాల సందర్భంగా సీఐటీయూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. బుధవారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో ఎల్ఐసీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎల్ఐసీ కల్వకుర్తి బ్రాంచ్ కార్యదర్శి లక్ష్మణాచారి చేతుల మీదుగా బహుమతి అందజేశారు. ఆంజనేయులు, నెహ్రూ ప్రసాద్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడికి హోమ పూజలు

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీమహాలక్ష్మి, అండాళ్‌వారు, ఆంజనేయస్వామి, గరుత్మంత, ధ్వజస్తంభ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా హోమాలను బుధవారం నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు ఆవాహిత దేవతల హోమం, సుదర్శన హోమం, మహాలక్ష్మి చండీ హోమం వంటి హోమ కార్యక్రమాలు నిర్వహించారు. సప్తనది సముద్ర జలాలతో అభిషేకాలు, పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను ఆలయ అర్చక బృందం ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు.

ఘనంగా లక్ష్మీనర్సింహాస్వామి బ్రహ్మోత్సవాలు



శిర్సవాడలో హోమంలో పాల్గొన్న భక్తులు

తాడూరు: మండలంలోని శిర్సవాడ లక్ష్మీనర్సింహాస్వామి బ్రహ్మోత్సవాలను సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపిరెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం సుప్రభాతం, సామూహిక గీతాయజ్ఞం, ధ్వజారోహణం, మండపారాదణ, అంకురార్పణ వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రకరకాల పూలతో ప్రత్యేక మాలలు ఏర్పాటు చేసి స్వామివారిని అలంకరించారు. జగదీశ్వరాచారితో పాటు బ్రాహ్మణులు మరికొంతమంది వేదపండితులతో హోమాలు నిర్వహించారు.

బైరాపూర్‌లో ధ్వజారోహణ

వెల్దండ: మండల పరిధిలోని బైరాపూర్‌లోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి బహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం స్వామికి ధ్వజారోహణ, ఎదుర్కోళ్ల కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. గురువారం స్వామికి అభిషేకం, పూర్ణాహుతి, సాయంత్రం 7 గంటలకు శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

జటప్రోల్‌లో ప్రారంభం

పెంట్లవెల్లి: సురభి వంశస్తులు మదనగోపాలస్వామి జటప్రోల్ ఆలయంలో మంగళవారం నుంచి ఐదో తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. అందులో భాగంగా బధవారం ఆలయంలో పలు పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ తర్వాత ఆ గ్రామం ముంపునకు గురవడంతో తిరిగి జటప్రోల్‌లో 40 ఏళ్ల కిందట నూతనంగా నిర్మించారు.

నూతన తేరు మహోత్సవం

42 ఏళ్ల తర్వాత సురభి వంశస్తులు శ్రీబాల ఆదిత్య లక్ష్మణ్‌రావు నూతనంగా రథోత్సవాన్ని ఈ సంవత్సరం చేయించారు. ఈ నెల 5న రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. బుధవారం హోమం, పల్లకీసేవా, కల్యాణోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



బైరాపూర్‌లో ఎదుర్కోళ్ల కార్యక్రమం



స్వామివారి పల్లకిసేవలో అర్చకులు, గ్రామస్తులు

నామమాత్రంగా పనులు చేపడితే ఆందోళన

లింగాల: మండలంలోని పలు మార్గాల్లో రోడ్ల బాగుపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన నిరంతరంగా కొనసాగుతుందని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు రాథోడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లింగాల నుంచి చెన్నంపల్లి ద్వారా ఎర్రపెంటకు బీటీ రోడ్డు మార్గం విషయంలో ఈ నెల 3న చేపట్టాల్సిన పాదయాత్ర అనివార్య కారణాలతో వాయిదా పడిందని తెలియజేశారు. జ్ఞానేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, లక్ష్మణ్‌నాయక్, బుడ్డయ్య, దస్తగిరి, ఇందిరమ్మ పాల్గొన్నారు.

కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



తెలకపల్లిలో నిరసన



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఆచారి

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుని వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులకు ఆచారి సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నర్సిరెడ్డి, కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పంచాయతీ కార్యదర్శుల ఆందోళనకు వంగూరు జెడ్పీటీసీ సభ్యుడు కేవీఎస్ రెడ్డి మద్దతుగా నిలిచి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు.

నాగర్‌కర్నూల్ రూరల్/తెలకపల్లి: పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల సంఘం నాయకులు వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

అచ్చంపేట: పంచాయతీ కార్యదర్శులు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ.. చేపట్టిన సమ్మె ఆరో రోజుకు చేరుకుంది.

కలెక్టర్ కార్యాలయానికి తరలిన వీఓఏలు



అచ్చంపేట నుంచి మహాధర్నాకు వెళ్తున్న వీవోఏలు

అచ్చంపేట: నియోజకవర్గం నుంచి బుధవారం వీఓఏలు కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. 15 రోజుల నుంచి సమ్మె చేస్తున్న పట్టించుకోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మల్లేష్, శంకర్‌నాయక్, పాండు, సత్యనారాయణ, సైదులు, పద్మ, సుమతి, భాస్కర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని వీఓఏల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు రమ డిమాండ్ చేశారు. తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాజుకుమార్, సుమలత, శ్రీనివాసులు, పర్వతాలు, మల్లేష్, రామయ్య పాల్గొన్నారు.

మేము సమ్మెకు దూరం

అమ్రాబాద్: మేము ఎటువంటి సమ్మెలో పాల్గొంటలేమని అమ్రాబాద్ మండల ఐకేపీ వీఓఏలు బుధారం జిల్లా కేంద్రంలో అదనపు డీఆర్‌డీఓను కలిసి వినతి అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో మేము పాల్గొంటున్నట్లు వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు. వినతి అందజేసిన వారిలో ఐకేపీ వీఓఏలు బాలబుచ్చయ్య, రంగయ్య, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఉప్పునుంతల: మండల కేంద్రంలో బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. స్థానిక భ్రమరాంబ ఆలయం పక్కన కేటాయించిన స్థలంలో పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, అనంతరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు లక్ష్మణాచారి, వెంకటాచారి, మల్లాచారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కొల్లాపూర్: మే డే ఉత్సవాల్లో భాగంగా కొల్లాపూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బైక్ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హమాలీలకు సంక్షేమ బోర్డు, అడ్డాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు సీఐటీయూ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరదంతో పాటు కార్మికులు ఉన్నారు.

గొర్రెల పంపిణీపై అవగాహన కల్పించాలి

చారకొండ: రెండో విడత గొర్రెల పంపిణీపై గ్రామాల్లో అధికారులు అవగాహన కల్పించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం మాజీ అధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్ కోరారు. మండలంలోని జూపల్లిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా అధికారులు ఆయా మండల స్థాయి, గ్రామాల్లో గ్రామాల వారీగా అవగాహన కల్పించి, సూచనలు అందించాలని కోరారు. పథకం వినియోగం, తదితర విషయాలను లబ్ధిదారులకు తెలియజేసి, పంపిణీ చేపట్టాలన్నారు. మల్లయ్య, సైదులు, వెంకటయ్య, సిరాజ్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

అచ్చంపేట: మండలంలోని రంగాపూర్, బుడ్డ తండా గ్రామాల్లో బుధవారం పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో 15 లీటర్ల సారా, 90 కిలోల బెల్లం, 30కిలోల స్పటిక 520 లీటర్ల బెల్లం ఊట స్వాధీనం చేసుకున్నారు. బెల్లం ఊటను అక్కడే పారబోసి కమల, శాందీలపై కేసు నమోదు చేసి అచ్చంపేట తహసీల్దార్ కృష్ణయ్య ఎదుట బైండోవర్ చేశారు. సీఐ అనుదీప్, అచ్చంపేట, సిద్ధాపూర్ ఎస్‌ఐలు గోవర్ధన్, గురుస్వామి, సీఐ పరమేష్, బాలరాజు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

